సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
శుక్రవారం। 7। మార్చి। 2025



హలీమ్‌కు సలాం

రంజాన్ మాసంలో చేపట్టే వంటకాల్లో హలీం ప్రత్యేకతను సంతరించుకుంది. ఒకప్పుడు హైద రాబాద్‌లోనే దొరికేది. ఇప్పుడు ప్రధాన పట్టణా ల్లోని ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. - 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్ర॥ (సా॥)	సహర్ శని॥ (ఉ॥)
కడప	: 6.30	5.12
పులివెందుల	: 6.32	5.17
ప్రొద్దుటూరు	: 6.31	5.16

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38.4 /22.6

జిల్లాలో గురువారం 22.6 - 38.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

కడప ఎడ్యుకేషన్ : జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడి యెట్ ప్రథమ సంవత్సరం పబ్లిక్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. 64 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన మాథ్స్–1ఎ, బాటనీ, సివిక్స్ పరీక్షలకు 878 మంది విద్యార్థులు గైర్హా జరయినట్లు ఆర్ఐవో బండి వెంకటసుబ్బయ్య తెలిపారు. జనరల్, ఒకేషనల్‌కు 19180 మంది విద్యార్థులకు గాను 18302 మంది హాజరు కాగా 878 మంది గైర్హాజరయ్యారు. ఇందులో జనరల్‌కు 17655 మందికి గాను 16906 మం ది హాజరు కాగా 749 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌కు 1525 మందికి గాను 1396 హాజరు కాగా 129 మంది గైర్హాజరయ్యారు.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

– కాంట్రాక్టు వర్కర్ల తొలగింపు

కడప సెవెన్‌రోడ్స్ : నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు విచారణలో తేలడంతో వేంపల్లె గ్రేడ్–1 పంచాయతీ సెక్రటరీ ఎస్వీ సుబ్బారెడ్డిని సస్పెండ్ చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి జి.రాజ్యలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన రూ.1,88,70,213 గ్రామ పంచాయతీ నిధు లను దుర్వినియోగం చేశారు. ఈ నేపథ్యంలో చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం పోరుమామిళ్ల గ్రామ పంచాయతీ గ్రేడ్–2 పంచాయతీ సెక్రట రీగా పని చేస్తున్న పి.రవిశంకర్‌రెడ్డి రూ.51,01,015, వేంపల్లె ఈఓపీఆర్‌డీగా పని చేస్తున్న బీవీఎస్ మల్లికార్జునరెడ్డి రూ.15,67,706 తమ వద్దనే ఉంచుకోవడం వల్ల వారిపై ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలని నిర్ణ యించారు. ఇక వేంపల్లె పంచాయతీలో కాం ట్రాక్టు వర్కర్లుగా పని చేస్తున్న వంశీ, ఖాజా లక్షలాది రూపాయల నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు జమ్మలమడుగు డివిజనల్ పం చాయతీ అధికారి విచారణలో వెల్లడి కావడంతో వారిని తొలగించారు. వేంపల్లె ఇన్‌చార్జి సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు నిధుల దుర్వినియోగా నికి పాల్పడినట్లు తెలిసింది. దీంతో ఎందుకు ఆయన చెక్ పవర్ రద్దు చేయరాదో వివరణ ఇవ్వాలని నోటీసు జారీ చేశారు.

వైవీయూ వీసీ బదిలీ



పణితి ప్రకాష్‌బాబు

కడప ఎడ్యుకేషన్ : యోగివేమన విశ్వవి ద్యాలయం (వైవీయూ) వైస్ చాన్స్ లర్‌గా పని చేస్తున్న పణితి ప్రకాష్‌బాబు పుదుచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా బదిలీ అయ్యారు. ఈ మేరకు భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వశాఖ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈయన వైవీయూ వీసీగా గత నెల 24న బాధ్యతలు చేపట్టారు. పది రోజుల్లోనే బదిలీ కావడంపై వైవీయూలో కొంత నిరాసక్తి నెలకొంది. బాధ్యతలు చేపట్టిన అనతి కాలం లోనే వైవీయూలోని పలు అభివృద్ధి కార్యక్ర మాలపై దృష్టి సారించారు. వైవీయూలో చాలా నెలల పాటు ఇన్‌చార్జి వీసీ పాలన సాగింది. రెగ్యులర్ వీసీ వచ్చారని, అభివృద్ధి జరుగుతుం దని ఆశించిన అనతి కాలంలోనే బదిలీ కావడం పై అసంతృప్తి వ్యక్తమవుతోంది. మళ్లీ త్వరగా రెగ్యులర్ వీసీని నియమిస్తారా లేక గతంలో మాదిరిగానే ఇన్‌చార్జి వీసీని కొనసాగిస్తారా అనే దానిపై సర్వత్రా చర్చ సాగుతోంది.

10న అప్రెంటిస్ మేళా

కడప ఎడ్యుకేషన్ : కడపలోని కాగితాలపెంట ప్రభుత్వ డీఎల్‌టీసీ ఐటీఐలో ఈ నెల 10న ఉదయం 10 గంటలకు అప్రెంటిస్ మేళా నిర్వ హించనున్నట్లు జిల్లా కన్వీనర్, ప్రిన్సిపాల్ జ్ఞాన కుమార్ తెలిపారు. అర్హత గల ఐటీఐ అభ్యర్థులు తమ పదో తరగతి, ఐటీఐ మార్కుల జాబితా, ఎన్‌టీసీ సర్టిఫికెట్‌తోపాటు ఆధార్‌కార్డు, కులధ్రు వీకరణ పత్రం. బ్యాంకు అకౌంట్ పుస్తకం, ఒక సెట్ జిరాక్స్ కాపీలు, రెండు పాస్ పోర్టు సైజ్ ఫొటోలు తీసుకుని హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు. అప్రెంటిస్ శిక్షణలో భాగంగా నెలకు రూ.7,700 నుంచి రూ.10 వేల వరకు స్టైఫండ్‌గా కంపెనీ వారు చెల్లిస్తారని వివరిం చారు. కావున విద్యార్థిని, విద్యార్థులు ఈ అవ కాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలు తెలపాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలో పని చేస్తున్న ఉపా ధ్యాయులు సీనియారిటీ జాబితాలకు సంబం ధించి ఏవైనా అభ్యంతరాలు ఉంటే.. 8, 9 తేదీ లలో జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో తెలియజేయాలని డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలి పారు. శని, ఆదివారాలు సెలవు దినాలు అయి నప్పటికీ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 7 గంటల వరకు అభ్యర్థుల నుంచి అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఒంటిమిట్టలో మహా సంప్రోక్షణ

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయంలో మహా సంప్రోక్షణ మహోత్స వాన్ని గురువారం ప్రారంభించారు. ఉదయం 7.30 గంటల నుంచి టీటీడీ పాంచరాత్ర ఆగమన సలహాదారు రాజేష్ కుమార్, వేదపండితులు భగవత్పుణ్యాహం, అగ్ని మదనం, ప్రధా నమూర్తి హోమాలు నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటల నుంచి చతుస్థానార్చనం, సహస్ర కలశాధివాసం, శాత్తుమొర చేపట్టారు.

నిందితుడే.. బాస్!

- మైదుకూరు తహసీల్దార్ రాజసింహనరేంద్రపై 420 కేసు
- ఏప్రిల్ 25న విచారణకు రానున్న వైనం
- ఆర్ఐ, వీఆర్వో, వీఆర్ఏ ప్రత్యక్ష సాక్షులు
- కింది స్థాయి సిబ్బంది వ్యతిరేకంగా సాక్షం చెప్పడం సాధ్యమా?
- రెవెన్యూ శాఖలో వింత వైఖరిపై విస్మపోతున్న జనం



మైదుకూరు తహసీల్దార్ కార్యాలయం

సాక్షి ప్రతినిధి, కడప : ఆయనది మండల మేజిస్ట్రేట్ హోదా. అదే మండలంలో ఆయనపై ఐపీసీ 420, 409, 120 సెక్షన్లతో గతంలో కేసు నమోదు అయిం ది. ఆ కేసులో రెండవ నిందితుడు. ఈ కేసు ఏప్రిల్ 25న విచారణకు రానుంది. మండల మేజిస్ట్రేట్ హోదాలో ఉన్న వ్యక్తి.. అదే మండలంలో నింది తుడిగా కోర్టు మెట్లు ఎక్కనున్నారు. మరోవైపు తహ సీల్దార్ హోదాలో నిందుతుడిగా కోర్టులో ఉంటే, ప్రత్యక్ష సాక్షులుగా కింది స్థాయి సిబ్బంది సాక్ష్యం ఇవ్వాల్సి ఉంది. రెవెన్యూ శాఖ వింత వైఖరితో.. విజి లెన్సు ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం వల పన్ని పట్టు కున్న ఓ కేసు నీరుగారిపోయే అవకాశం లేకపోలేదు. వివరాలు ఇలా ఉన్నాయి.

ప్రస్తుత మైదుకూరు తహసీల్దార్ రాజసింహ నరేంద్ర గతంలో డిప్యూటీ తహసీల్దార్ హోదాలో ప్రభుత్వ గోడౌన్ ఇన్‌చార్జీగా ప్రొద్దుటూరులో విధులు నిర్వర్తిస్తుండే వారు. అప్పట్లో ప్రభుత్వ గోడౌన్ నుంచి 19 బస్తాల సబ్సిడీ రాగులు ప్రొద్దుటూరు నుంచి మైదుకూరు బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తుండగా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం పట్టుకుంది. ఆమేరకు మైదుకూరు పోలీసుస్టేషన్‌లో క్రైమ్ నంబర్ 469/2019 అండర్ సెక్షన్ 409, 420, 120–బి రెడ్‌విత్ 34 ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు అయింది. ప్రధాన నిందితుడిగా ఆటోడ్రైవర్ నిట్టూరు పెద్ద మస్తాన్ కాగా, ఏ–2గా వేల్పుల రాజసింహ నరేంద్ర (ప్రస్తుత మైదుకూరు తహసీల్దార్), ఏ–3గా లక్ష్మీపేట ఎఫ్‌పీ షాపు డీలర్ సుదర్శన్‌రెడ్డి ఉన్నారు. ఏ–4, ఏ–5లుగా మైదుకూరుకు చెందిన వ్యాపారులు లక్ష్మీ నారాయణ, రామకృష్ణపై పోలీసులు కోర్టుకు చార్జీషీట్ దాఖలు చేశారు. కాగా ఈ కేసుపై ఏప్రిల్ 25న మైదు కూరు కోర్టులో వాయిదా ఉంది. నింది తులు అంతా హాజరైతే కేసు విచారణ చేపట్టనున్నట్లు సమాచారం.

పై అధికారిపై సాక్ష్యం సాధ్యమేనా..

బాస్‌పై కింది స్థాయి సిబ్బంది సాక్ష్యం చెప్పడం సాధ్య మేనా... అంటే ఉన్నది ఉన్నట్లు సాక్ష్యం చెప్పడం అసా ధ్యమని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. ఆరోపణలు ఎదు ర్కొంటున్న వ్యక్తి మైదుకూరు మండల మేజిస్ట్రేట్ హోదాలో ఉన్నారు. సాక్ష్యం చెప్పాల్సిన వారిలో తన కింద పని చేస్తున్న వీఆర్ఏ ప్రసాద్‌కుమార్ ఉన్నారు. దువ్వూరు మండలంలో ఎంఆర్ఐగా పని చేస్తున్న ఆవుల జాన్సన్, వీఆర్వోగా పని చేస్తున్న షేక్ ఫజల్ ఆలీ ప్రత్యక్ష సాక్షులు. అప్పట్లో మైదుకూరులో పని చేస్తున్న ఆ ఇరువురు బదిలీపై దువ్వూరు మండలంలో విధులు కొనసాగిస్తున్నారు. వీరంతా స్థానికంగా ఉన్న తహసీల్దార్‌పై సాక్ష్యం సవ్యంగా చెప్ప గలరా అనే ప్రశ్న తలెత్తుతోంది. ఇదే విషయమై విజిలెన్సు ఎన్‌ఫో ర్స్‌మెంట్ విభాగం సైతం ఆవేదన వ్యక్తం చేస్తోం ది. అక్రమార్కులను కట్టడి చేసేందుకు ప్రయత్నిస్తే.. ఆయా ప్రభుత్వ శాఖల సహకారం లేకపోతే కేసులు నీరుగారే అవకాశం ఉందని సీనియర్ అధికారులు వాపోతున్నారు. కంచె చేను మేసినట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని.. అదే మండలంలో రెవెన్యూ బాస్‌గా నియమించడం ఏమిటని పలువురు నిలదీస్తు న్నారు. 420, 409, 120 ఐపీసీ సెక్షన్ల ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజసింహనరేంద్ర అదే మం డలానికి తహసీల్దార్‌గా నియామకం వెనుక ప్రధానం గా ఈ కేసు నుంచి గట్టేక్కాలనే దృఢ సంకల్పం ఉన్నట్లు తెలుస్తోంది. అందుకు రెవెన్యూ శాఖ సైతం సంపూర్ణ సహకారం అందిస్తున్నట్లు సమాచారం.

మనోడైతే ఎలాంటి ఆరోపణలున్నా సరే..

సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబునా యుడు వైఎస్సార్‌సీపీ పక్షం వారికి పనులు చేయ రాదంటూ బాహాటంగా వ్యాఖ్యానిస్తున్నారు. ఈ తరుణంలో ఎలాంటి ఆరోపణలున్నా సరే.. అధి కార పార్టీ నేతల సహకారం ఉంటే అధికారులకు పోస్టింగ్ ఇస్తున్నారు. అందులో భాగంగానే మైదుకూరు తహసీల్దార్ రాజసింహ నరేంద్రకు సైతం మైదుకూరులో పోస్టింగ్ దక్కిందని పలు వురు వెల్లడిస్తున్నారు. కలెక్టర్ నిష్పక్షపాతంగా అధికారం ప్రయోగిస్తే కేసులో నిందితుడుగా ఉన్న వ్యక్తికి.. అదే ప్రాంతానికి మండల మేజి స్ట్రేట్ హోదాలో కూర్చోబెట్టే అవకాశం లేదని పరి శీలకులు వెల్లడిస్తున్నారు. కేసు విచారణ పూర్తి అయ్యేంత వరకూ మైదుకూరు తహసీల్దార్ రాజ సింహనరేంద్రను అక్కడి నుంచి తప్పించాలని పలువురు డిమాండ్ చేస్తుండటం గమనార్హం.

రూటే.. సప‘రేటు’..!

ఏ పనైనా సరే చేయాలంటే అందుకు నిబంధనలు ఉంటాయి. అయితే ఇక్కడ ప్రభుత్వ నిబంధనలకు తిలోదకాలిచ్చారు. ‘పరిపాలనకు’ పాతర వేశారు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు ‘అవినీతి జాడ్యం’ పట్టుకుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

- వైద్య ఆరోగ్య శాఖలో ‘కాసుల వేట’
- ప్రతి పనికీ ఓ లెక్క
- నిబంధనలకు విరుద్ధంగా బదిలీ



కడపలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం

సాక్షి టాస్క్‌ఫోర్స్ : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ శాఖలో తవ్వే కొద్దీ అవినీతి, అక్రమాలు బయట పడుతున్నాయి. ఇటీవల కాలంలో అవకతవ కలపై విచారణలు జరుగుతున్నాయి. తాజాగా మరికొన్ని అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఈ శాఖలో పరిపాలన అదుపు తప్పిందనే వాదన ఉద్యోగుల నుంచి వినిపిస్తోంది. ఇందుకు సం బంధించిన కొన్ని ఉదాహరణలు..

‘బ్యాన్’ ఉన్న వేళ బదిలీ

ఉద్యోగుల బదిలీలకు సంబంధించి ప్రభుత్వం ‘బ్యాన్’ విధించింది. అంటే బ్యాన్‌ను తొలగించే వరకు ఎలాంటి బదిలీలు చేపట్టకూడదు. అయితే ఈ శాఖలో నిబంధనలు ధిక్కరించి బదిలీ చేయడం గమనార్హం. ఉమ్మడి జిల్లాకు సం బంధించి పుల్లంపేట పీహెచ్‌సీలో పని చేస్తున్న ఒక ఉద్యోగి ఆరు నెలలు మెడికల్ లీవ్ పెట్టారు. మెడికల్ లీవ్ అనంతరం ఆ ఉద్యోగికి రీపోస్టింగ్ ఇవ్వాలి. ప్రస్తుత జీఓ ప్రకారం తిరిగి పుల్లం పేటకే పోస్టింగ్ ఇవ్వాలి. అయితే అందుకు విరు ద్ధంగా మాధవరం పీహెచ్‌సీకి పోస్టింగ్ ఇచ్చారు. అంటే ఆ ఉద్యోగిని పుల్లంపేట నుంచి మాధ వరానికి బదిలీ చేశారు. ‘బ్యాన్’ ఉన్న సమయం లో ఈ బదిలీని ఏ ప్రాతిపదికన చేపట్టారో.. ఆ శాఖ వారికే ఎరుక. ఇందుకు గాను ఆ ఉద్యోగి నుంచి రూ.50 వేల నుంచి రూ. లక్ష వరకు లం చం తీసుకున్నట్లు సమాచారం. అలాగే ఆ ఉద్యోగి ఆరు నెలల మెడికల్ బిల్లు రూ.1,75,000 మంజూరు చేయడానికి మరో రూ.20 వేలు వసూలు చేసినట్లు తెలిసింది.

ఉద్యోగులు సతమతం

అలాగే సొంత శాఖలో జిల్లా వ్యాప్తంగా పని చేసే సిబ్బందిని కూడా వదలడం లేదు. డ్రాయింగ్ అండ్ డిస్‌పర్స్‌మెంట్ పరిధి కారణంగా 90 పీహెచ్‌సీలు వస్తాయి. మెడికల్ ఆఫీసర్ మొదలు కొని క్షేత్ర స్థాయి సిబ్బంది వరకు సర్వీసుకు సం బంధించిన అంశాలు ఉంటాయి. ఇక్కడ కూడా చేతివాటం ప్రదర్శిస్తున్నారు. మెడికల్ లీవ్‌కు రూ 5.వేలు, ఎర్న్ లీవుకు రూ.3 వేలు, ఇంక్రిమెంట్ మంజూరుకు డాక్టర్‌కు అయితే రూ.3 వేలు, ఫీల్డ్ స్థాయి సిబ్బందికి రూ.2 వేలు, ఏదైనా దరఖా స్తును డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు ఫార్వర్డ్ చేయాలంటే రూ.5 వేలు, గర్భిణుల మెడికల్ బిల్లుకు రూ.5 వేలకు పైగా ఇలా ప్రతి పనికి ఒక రేటును ఫిక్స్ చేసి వసూలు చేస్తున్నారు. ఇందుకు కొంత మం ది ఉద్యోగులు పని చేస్తున్నారు. ఈ శాఖలో వేలాది మంది ఉద్యోగులు ఉన్నారు. ఏవైనా కార్యాలయ పనులు పడినప్పుడు అడిగినంత ఇచ్చుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. లేదం టే ఫైళ్లు ముందుకు కదలవు.. పనులు జరగవు. దీంతో ఈ శాఖలో పూర్తి స్థాయిలో ‘పరిపాల న’కు పాతర పడిందనే ఆరోపణలు వినిపి స్తున్నాయి. ఉద్యోగులు ఉద్యోగ భద్రతా కార ణాల వల్ల తమ సమస్యలను బహిర్గతంగా చెప్పుకోలేరు. కారణాలు ఏవైనప్పటికీ సమగ్ర విచారణ చేపట్టి ప్రభుత్వ నిబంధనలు అమల య్యేలా చూడాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తం అవుతోంది.

ఆకట్టుకున్న ఆయుధాల ప్రదర్శన



ఓపెన్‌హౌస్‌లో విద్యార్థులకు ఆయుధాలపై వివరిస్తున్న పోలీస్ అధికారులు

కడప అర్బన్ : విద్యార్థులను పోలీస్ ఆయుధాల ప్రదర్శన ఆకట్టుకుంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో మహిళా సాధికారత వారో త్సవాల్లో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయం లోని పరేడ్ మైదానంలో ఓపెన్ హౌస్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ గురువారం పాఠశాల విద్యార్థుల చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు విధి నిర్వహణలో భాగంగా వినియోగించే ఆయుధాలు, దుస్తులు, పనిముట్లు, నేరదర్యాప్తు విధానం తదితర విష యాలను విద్యార్థులకు తెలియజేయడానికి ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బాంబు డిస్పోజబుల్ టీం, ఫింగర్‌ప్రింట్, పోలీస్ కంట్రోల్ రూమ్, కమ్యూనికేషన్స్, ఆయుధాల విడి భాగాల సమాచారం(ఏకె–47, విల్ పిస్టల్, గ్లో17, కార్బన్, ఇన్సాఫ్ రైఫిల్, గ్యాస్‌గన్, గ్రేనేడ్, ఫోరెన్సిక్, ఆర్ఎ ఫ్ఎస్ఎల్) తదితర విషయాలపై వివరించారు. బాడీవోర్న్ కెమెరాలు, డ్రోన్ కెమెరా, వీహెచ్ఎఫ్ సెట్, రోబో డ్రెస్, లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్, బాంబు డిస్పోజల్ టీం, వినియోగించే డీఫ్ సెర్చ్ మెటల్ డిటెక్టర్ (డీఎస్ఎండీ), టెలిస్కోప్ మ్యానిపు లేటర్, రిమోట్ వైర్ కట్టర్‌లను ప్రదర్శనలో ఉం చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్‌బాబు, ఏ.ఆర్. అదనపు ఎస్పీ బి.రమ ణయ్య, ఏఆర్ డీఎస్పీ కె.శ్రీనివాసరావు, ఆర్ఐ ఆనంద్, కడప నగరంలోని పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎంఈలతో అభివృద్ధి సాధ్యం

కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



మహిళా సంఘాల ప్రతినిధులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ శ్రీధర్

కడప కోటిరెడ్డిసర్కిల్ : సూక్ష్మ, చిన్నతరహా పరిశ్ర మల(ఎంఎస్‌ఎంఈల) సాధికారతతో దేశ సామాజిక, ఆర్థిక పరిపుష్టి సాధ్యం అవుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. గురువారం కడ ప–పులివెందుల రోడ్డులోని మహాలక్ష్మి ఫంక్షన్ హాలులో యూనియన్ బ్యాంకు వారు ఏర్పాటు చేసిన ‘మెగా ఎంఎస్‌ఎంఈ ఔట్ రీచ్ క్యాంపు’ కార్యక్ర మానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యూనియన్ బ్యాంకు ఎంఎస్‌ఎంఈ జీఎం జి.కె.సుధా కర్, కడప రీజినల్ మేనేజర్ లక్ష్మీతులసి అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ కడప యూనియన్ బ్యాంకు సంస్థ ఎంఎస్‌ఎం ఈల కోసం ప్రత్యేక ఔట్ రీచ్ కార్యక్రమం ద్వారా ప్రజల్లో వ్యాపార, పెట్టుబడి ధోరణిలో పారిశ్రామిక రంగం వైపు అవగాహన పెంచడం అభినందనీయం అన్నారు. పరిశ్రమలలో ఒక భాగంగా ఉన్న ఎంఎస్ ఎంఈ విభాగాన్ని ఒక ప్రత్యేక పారిశ్రామిక రంగంగా ఒక పాలసీని తీసుకురావడం, అందుకు సంబంధించి ‘ఉద్యం’ పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరుగుతోందన్నారు. ఒక వ్యాపారాన్ని ప్రారంభించే ప్రతి ఒక్కరూ ఉద్యం పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని ప్రభుత్వం నుంచి అందే అన్ని రకాల రాయితీలను పొందాలని పేర్కొన్నారు. స్వయం సహా యక సంఘాల సభ్యులు ప్రభుత్వ సహాయ సహకా రాలు అందిపుచ్చుకుని పారిశ్రామికవేత్తగా రాణించా లన్నారు. ఎంఎస్‌ఎంఈ జీఎం జి.కె.సుధాకర్ మాట్లా డుతూ... ఎంఎస్‌ఎంఈ లబ్ధిదారులకు సెక్యూరిటీ లేకుండా సుమారు ఐదు కోట్ల రుణాలను యూని యన్ బ్యాంకు సంస్థ అందిస్తోందన్నారు. యూనియన్ బ్యాంకు కడప రీజినల్ మేనేజర్ లక్ష్మి తులసి మాట్లాడుతూ కడప రీజియన్ పరిధిలో 600 కోట్లతో ఎంఎస్‌ఎంఈలకు రుణాలను అందివ్వడం గర్వించ దగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాం తాల్లో 400 మంది ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు మంజూరైన రూ.20 కోట్లు, పట్టణ ప్రాంతాల్లో 200 గ్రూపులకు చెం దిన రూ.12 కోట్ల రుణాలకు సంబంధించి మెగా చెక్కులను మహిళా సంఘాలకు, చేనేత సంఘాలకు మంజూరు చేసిన కోటి రూపాయలు, బీసీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన రూ.6.12 కోట్లను లబ్ధిదారులకు కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. అలాగే ఉమెన్ ఎంపవర్‌మెంట్ కింద ఎంపికైన పలువురు మహిళలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్య క్రమంలో డీఆర్‌డీఏ, మెప్మా, ఐసీడీఎస్ పీడీలు ఆనం ద్‌నాయక్, కిరణ్‌కుమార్, శ్రీలక్ష్మి, చేనేత జౌళిశాఖ ఏడీ పిచ్చయేశ్వరరావు, బీసీ కార్పొరేషన్ ఈడీ జయసిం హా, యూనియన్ బ్యాంకు అన్నిశాఖలు బీఎంలు, బ్యాంకు ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కూలిన బతుకులు



మృతి చెందిన లక్షుమ్మ

రెక్కాడితే గానీ డొక్కాడని బతుకులు వారివి. రోజూ కూలి పనికి వెళ్తేనే.. నాలుగు వేళ్లు నోట్లోకి వెళతాయి. వారి కుటుంబ జీవనం గడుస్తుంది. అలాంటి వారిపై విధి చిన్న చూపు చూసింది. రోడ్డు ప్రమాదం రూపంలో ఇద్దరిని బలి తీసుకుంది. ఏడుగు రిని ఆస్పత్రి పాలు చేసింది. వారిని నమ్ముకున్న కుటుంబాలను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ‘ఎంత పని చేశావు దేవుడా’ అంటూ వారు గుండెలవిసేలా రోదించారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయామంటూ కన్నీరుమున్నీరుగా విలపించారు. ఇక తాము కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలంటూ.. శోకసంద్రంలో మునిగిపోయారు.



వెంకటాంజనేయులు మృతదేహం



ప్రమాదానికి గురైన ట్రాక్టర్



ఢీకొన్న లారీ



బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి

- చిలంకూరులో ఘోర రోడ్డు ప్రమాదం
- ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ
- ఇద్దరు మృతి
- ఏడుగురికి గాయాలు
- బాధితులంతా కూలీలే

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని చిలంకూరు గ్రామ సమీపంలో గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. నాపరాయి గని పనులకు కూలీలను తీసుకెళ్తున్న ట్రాక్టర్‌ను లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు కూలీలు మృతి చెందగా, ఏడు గురు గాయపడ్డారు. వెంటనే స్థానికులు క్షతగాత్రు లను ఆస్పత్రికి తరలించారు. ఎర్రగుంట్ల సీఐ నరేష్ బాబు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చిలంకూరు గ్రామంలోని కొందరు కూలీలు.. నిడుజి వ్వి గ్రామ పరిధిలోని నాపరాయి గనిలోకి పనికి వెళ్తుం టారు. అందులో భాగంగా గురువారం తెల్లవారుజా మున చిలంకూరు నుంచి నిడుజివ్వి గ్రామానికి ట్రాక్ట ర్‌లో తొమ్మిది మంది కూలీలు బయలుదేరారు. ట్రాక్టర్ గ్రామం దాటింది అంతే.. పూణే నుంచి మద్రాసు వెళ్లే లారీ అతి వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌లో ఉన్న తొమ్మిది కూలీలకు తీవ్ర గాయాలు అయ్యాయి.

క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించిన స్థానికులు

గ్రామ సమీపంలోనే ప్రమాదం జరగడంతో.. వెంటనే స్థానికులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. బాధితు లను ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ముత్తరాసుగారి లక్షుమ్మ (56), నత్తి గంగులరాగారి వెంకటాంజనేయులు (52) ఆసుపత్రికి చేరుకున్న వెం టనే మృతి చెందారు. మల్లేల రోశయ్య, ఎట్టిచిన్న ఓబన్న, పోలుగారి గురప్ప, పొన్నా వెంకటసుబ్బయ్య, గంగాదాం పల్లి హరినాథ్, కేజీ ఓబయ్య, మాలపాటి బాలస్వామి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వెంటనే పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృత దేహాలకు పోస్టుమార్టం నిర్వహింపజేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బాధితులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

సంఘటన విషయం తెలుసుకున్న వెంటనే మాజీ ఎమ్మెల్యే డాక్టరు ఎం.సుధీర్‌రెడ్డి ప్రొద్దుటూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గాయప డిన వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఈ సంఘటన దురదృష్టకరమని ఆయన పేర్కొన్నారు.

ప్రగతిలో జిల్లాను అగ్రగామిగా నిలుపుదాం

కడప సెవెన్‌రోడ్స్ : ఆకాంక్ష జిల్లాల (ఆస్పిరేషన్ డి స్ట్రిక్ట్స్) ఆశయాలకు అనుగుణంగా జిల్లాను అభివృ ద్ధిలో అగ్రగామిగా నిలుపుదామని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులకు సూచించారు. గురు వారం స్థానిక కలెక్టరేట్ బోర్డు రూమ్ హాలు నుంచి ‘ఆకాంక్ష జిల్లాల ఆశయ సాధన కార్యాచరణ ప్రగ తి’పై జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌తో కలసి కలె క్టర్ సంబంధిత శాఖల జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం నుంచి డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ జనరల్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ పోస్ట్స్ డాక్టర్ సచిన్ మిట్టల్ హాజ రయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీధర్ మాట్లా డుతూ ‘నీతి ఆయోగ్’ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా కొన్ని ఆకాంక్ష జిల్లాలను ఎంపిక చేసిందన్నారు. అందులో వైఎస్ఆర్ జిల్లా విజయనగరం, విశాఖపట్నం జిల్లాలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. అందులో భాగంగా ఆయా జిల్లాల్లో సామాజిక స్థాయిని(అభివృద్ధి) ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి తీసుకురావడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. అనంతరం జిల్లాలో చేపడుతున్న ప్రగతిపై పీపీటీ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్.. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ జనరల్‌కు వివరించారు. జిల్లా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత శాఖల అధికా రులు, సిబ్బంది సమన్వయంతో ముందుకు సాగా లన్నారు. సంతృప్త స్థాయిలో నిర్దేశిత లక్ష్యం మేరకు సాధించిన ప్రగతి ఆధారంగా ప్రోత్సాహకాలను కూడా భారీ స్థాయిలో కేంద్ర ప్రభుత్వం అందిస్తుం దన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్, మెప్మా పీడీ కిరణ్ కుమార్, సీపీఓ హజ్రతయ్య, పరిశ్రమల శాఖ జీఎం చాంద్‌బాషా, ఐసీడీఎస్ అధికారిణి శ్రీలక్ష్మి, హార్టికల్చర్ డీడీ సుభాషిణి, పశుసంవర్ధక శాఖ జేడీ శారదమ్మ, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజరు జనార్దన్, పోస్టల్ అధికా రులు ఎస్ఆర్ బాషా తదితర అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై అవగాహన పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి సుభాషిణి

కడప అగ్రికల్చర్ : ఉద్యాన పంటల సాగుపై రైతు లకు అవగాహన పెంచాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి సుభాషిణి సూచించారు. గురువారం కడప కలెక్టరేట్‌లోని జిల్లా వ్యవసాయశాఖ మీటింగ్ హాల్‌లో గ్రామ ఉద్యాన సహాయకులకు ఉద్యాన పం టలు, స్వర్ణాంధ్రప్రదేశ్ 2047 విజన్ ప్లాన్‌పై అవగా హన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి ఊటుకూరు కేవీకే శాస్త్రవేత్త మానస, ఏపీ ఎంఐపీ పీడీ వెంకటేశ్వరరెడ్డి, ఉద్యానశాఖ అధికారులు, డిజి టల్‌గ్రీన్ సిబ్బంది, గ్రామ ఉద్యాన డిజిటల్ గ్రీన్స్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన శాఖ అధికారి సుభాషిణి మాట్లాడుతూ ఉద్యాన పథకాలు అమలు చేసే విధానాన్ని ప్రతి రైతుకు చేరవేయాల న్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంకేతిక ఉద్యా నశాఖ అధికారి జ్యోతిర్మయి, ఉద్యానశాఖ అధికారి జయభరత్‌రెడ్డి, డిజిటల్ గ్రీన్ సిబ్బంది వెంకటగౌడ్, సహాయకులు ప్రవీణ్, గ్రామ ఉద్యాన సహాయ కులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

కువైట్‌లో అడుసువారిపల్లె వాసి మృతి


రమణారెడ్డి (ఫైల్)

గోపవరం : మండలంలోని బ్రాహ్మణపల్లె పంచాయతీ అడుసువారిపల్లె గ్రామానికి చెందిన వంతెరపల్లె రమణారెడ్డి (54) కువైట్‌లో మృతి చెందాడు. ఇతను బతుకుదెరువు కోసం గత కొన్నేళ్లుగా కువైట్‌లో ఉన్నాడు. రోజువారి కూలి పనులు చేసుకుంటుండగా మూడు నెలల క్రితం ప్రమాదవశాత్తు ఇనుపరాడ్లు మీద పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. కువైట్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 3వ తేదీన మృతి చెందాడు. కుటుంబ పెద్ద మృతి చెందడంతో ఆ కుటుంబం ఒక్కసారిగా శోకసంద్రంలో మునిగిపోయింది. కువైట్ నుంచి మృతదేహం గురువారం ఉదయం స్వగ్రామం చేరుకుంది. అంత్యక్రియలు నిర్వహించారు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అతిగా మద్యం తాగి యువకుడు..


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ

ముద్దనూరు : మద్యానికి బానిసగా మారిన బుల్లి అశోక్ (32) అనే యువకుడు గురువారం మండలంలోని కొత్తపల్లె గ్రామ శివారులో సున్నపురాళ్లపల్లె బస్‌స్టాప్ వద్ద మృతి చెందాడు. సీఐ దస్తగిరి సమాచారం మేరకు అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం భద్రంపల్లె గ్రామానికి చెందిన అశోక్‌కు పదేళ్ల క్రితం కర్నూలు జిల్లా ఆలూరు గ్రామానికి చెందిన సునీత అనే మహిళతో వివాహమైంది. మూడేళ్ల క్రితం అతని భార్య ఇంటినుంచి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన అశోక్ మద్యానికి బానిస అయ్యాడు. ఈనెల 5వతేదీన తన భార్య వద్దకు వెళ్లి వస్తానని చెప్పి అశోక్ ఇంటినుంచి బయలుదేరాడు. అయితే గురువారం సున్నపురాళ్లపల్లె వద్ద పడిపోయి ఉండడంతో పోలీసులు గుర్తించారు. అతిగా మద్యం తాగడం వల్లగానీ, మరే ఇతర కారణంతోనైనా అశోక్ మరణించి ఉండవచ్చని వారు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వాసాలు అక్రమ నిల్వపై రూ.52 వేలు జరిమానా

ముద్దనూరు : జమ్మలమడుగులోని రామిరెడ్డిపల్లె రహదారిలో బుధవారం పోలీసులు గృహ నిర్మాణానికి వినియోగించే వాసాలను స్వాధీనం చేసుకుని అటవీశాఖకు అప్పగించారు. 38 వాసాలు అక్రమంగా కలిగి ఉండటంతో రూ. 52 వేలు జరిమానా విధించినట్లు ముద్దనూరు ఫారెస్టు రేంజి అధికారి అశోక్‌కుమార్ గురువారం తెలిపారు.

ఆటో బోల్తా

మదనపల్లె : ఆటో బోల్తా పడి డ్రైవర్ గాయపడిన సంఘటన గురువారం కురబలకోట మండలంలో జరిగింది. ఎర్రమద్దివారిపల్లెకు చెందిన సుబ్బయ్య కుమారుడు రమేష్(26) సొంతంగా ఆటో నడపడమే కాకుండా స్థానికంగా ఓ మామిడి తోట వద్ద కాపలాగా ఉన్నాడు. గురువారం వ్యక్తిగత పనులపై ఆటోలో అంగళ్లకు బయలుదేరాడు. మార్గమధ్యంలో ఓ మలుపు వద్ద ఆటో వేగాన్ని అదుపుచేయలేకపోవడంతో బోల్తా పడింది. ప్రమాదంలో రమేష్ గాయపడగా, స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హలీమ్‌కు సలాం

- రంజాన్ ప్రత్యేక వంటకంగా గుర్తింపు
- రుచికి ఫిదా అవుతున్న జనం



హలీంను కొనుగోలు చేస్తున్న ప్రజలు

రాజంపేట టౌన్ : రంజాన్ మాసంలో చేపట్టే వంటకాల్లో హలీం ఎంతో ప్రత్యేకతను సంతరించుకుంది. ఒకప్పుడు హైదరాబాద్‌లోనే దొరికే హలీం ఇప్పుడు ప్రధాన పట్టణాల్లోని ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. రంజాన్ మాసం సందర్భంగా ఉపవాసం ఉండే ముస్లీంలే కాక ఇతర మతాల వారు హలీం రుచిని ఎంతో ప్రీతిగా ఆస్వాదిస్తారు. అందువల్ల ఇప్పుడు సాయంత్రం ఆరు గంటలు అయితే చాలు అనేక మంది ప్రజలు హలీం విక్రయించే చోట వాలిపోతున్నారు.

హలీం అరబ్ దేశానికి చెందిన వంటకం

హలీం అరబ్ దేశానికి చెందిన వంటకమని ముస్లీంలు చెబుతున్నారు. ఆరో నిజాం నవాబు మహబూబ్ అలీఖాన్ హయాంలో అరబ్ దేశమైన పర్షియా నుంచి హలీం తెలుగు రాష్ట్రమైన హైదరాబాద్‌కు చేరుకొని ఎంతో ప్రసిద్ధిగాంచింది. మహబూబ్ అలీఖాన్ తన సంస్థానంలో పోలీసు వ్యవస్థను బలోపేతం చేసేందుకు కీలకమైన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి పర్షియా నుంచి ప్రత్యేక ఆహ్వానితులు వచ్చారు. ఆ సమయంలో రంజాన్ ఉపవాస దీక్షల్లో ఇఫ్తార్‌కు తయారు చేసే ప్రత్యేక వంటకమైన హలీం గురించి ప్రస్తావించారు. వెంటనే నవాబు తన సిబ్బందిని పిలిపించి హలీంను తయారు చేయించారు. ఆ విధంగా హలీం తొలుత హైదరాబాద్‌కు పరిచయమై ఇప్పుడు అన్ని పట్టణాలకు చేరుకుని ప్రజలతో లొట్టలేయిస్తోంది.

తయారీ కూడా ప్రత్యేకమే

సాంప్రదాయ వంటలతో పోలిస్తే హలీం తయారీ చాలా ప్రత్యేకమైనది. హలీం తయారీకి కనీసం తొమ్మిది గంటల సమయం పడుతుంది. ఇందులో మటన్ లేదా చికెన్, గోధుములు, అన్ని పప్పుదినుసులు, బాస్మతిబియ్యం, నెయ్యి, అల్లంవెల్లుల్లి పేస్ట్, ఉల్లిగడ్డ, పచ్చిమిర్చి, యాలకలు, దాల్చిన చెక్క, మిరియాలు, కొత్తిమీర, నూనె, డ్రైఫ్రూట్స్ తదితర వస్తువులను వినియోగించి తయారు చేసి ఇఫ్తార్ సమయానికి సిద్ధం చేస్తారు. ఉపవాసం ముగించుకున్న ముస్లీంలతో పాటు ఇతర మతాలకు చెందిన వారు సైతం హలీంను ఆరగించేందుకు ఇష్టపడతారు. అక్కడే తినేవారికి పింగాణి కప్పులలో వేయిస్తుండగా పార్శిల్ తీసుకెళ్లే వారికి బాక్సులలో వేయిస్తున్నారు. ఒక్కో బాక్సు రూ.150, రూ.250, రూ.500కు విక్రయిస్తున్నారు.

రుచి అమోఘం



రంజాన్ మాసంలోనే దొరికే హలీం రుచి అమోఘంగా ఉంటుంది. పోషకాలు కలిగిన ఆహారం అయినందున ఉదయం నుంచి ఉపవాసం ఉండే ముస్లీంలు హలీంను తినడం వల్ల శక్తి పునరుత్తేజం అవుతుంది. ఇటు రుచి అటు పోషకాలు కలిగిన ఆహారం అయినందున మా కుటుంబంలో అందరు కూడా రంజాన్ మాసంలో హలీంను ఎక్కువ తింటాము.

షేక్ అబ్దుల్లా, రాజంపేట

శక్తివంతమైన ఆహారం



హలీం శక్తివంతమైన ఆహారం. మాసంతో పాటు అనేక రకాల పప్పుదినుసులతో తయారు చేయడం వల్ల ప్రొటీన్లు, విటమిన్లు ఎక్కువగా ఉంటాయి. చెక్క, లవంగాలు, ఉల్లిపాయలతో చేయడం వల్ల రోగనిరోధక శక్తిని కూడా పెంచుతుంది. రుచి బాగుండటంతో పాటు ప్రొటీన్లు ఎక్కువగా ఉంటాయని అతిగా తినడం అంతమంచిది కాదు. మితంగా తినాలి. అప్పుడే హలీం ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

డాక్టర్ పాలనేని వెంకట నాగేశ్వరరాజు, సూపరింటెండెంట్, ప్రభుత్వ హాస్పిటల్, రాజంపేట

రంజాన్ వేళ.. రూపుదిద్దుకుంది ఇలా..!

చిన్నపాటి కార్డులో సహర్, ఇఫ్తార్ వేళలు తెలియజేసే పట్టిక

రాజంపేట టౌన్ : ముస్లింలు రంజాన్ మాసాన్ని అత్యంత పవిత్రంగా భావిస్తారు. ఈ మాసంలో ముస్లింలు నియమ, నిష్టలతో ఉపవాసాలు ఉంటారు. ఉపవాసం చేపట్టే, విరమించే సమయాన్ని విధిగా పాటిస్తారు. ఎందుకంటే సహర్, ఇఫ్తార్‌ల సమయం కంటే ముందుగాని, ఆలస్యంగా గాని ఉపవాసం చేపట్టడం, విరమించడం చేస్తే ఆ రోజు చేపట్టే ఉపవాస దీక్షకు సార్థకత ఉండదని ముస్లిం మతపెద్దలు చెబుతున్నారు. అందువల్ల సహర్, ఇఫ్తార్‌లు సరైన సమయంలోనే పూర్తి చేయాలి.

పూర్వం ఎలా చేసేవారంటే...

ప్రస్తుతం సహర్, ఇఫ్తార్‌లు ఏ సమయంలో చేపట్టాలో తెలియజేసేందుకు కాలపట్టిక అందుబాటులోకి వచ్చింది. అయితే ఈ కాలపట్టిక అందుబాటులోకి రాని సమయంలో సహర్, ఇఫ్తార్ వేళలను తెలియజేసేందుకు తూటాలు పేల్చేవారు. టపాసులు అందుబాటులోకి వచ్చాక టపాసులను పేల్చి తెలియజేసేవారు. కాలక్రమంలో మైకులు అందుబాటులోకి వచ్చాక మసీదుల్లో మౌజన్‌లు ఉపవాసం ప్రారంభానికి ఓ అరగంట ముందు రోజేదారో ఉఠో..ఉఠో (ఉపవాసం ఉండేవారు లేవండి) అంటూ నిద్రలేపేవారు. ఇక ఇఫ్తార్ సమయాన్ని అదే సమయంలో తెలియజేసేవారు. ప్రస్తుతం కాలం పూర్తిగా మారిపోయినందున సహర్, ఇఫ్తార్ వేళలను కార్డుల్లో ముద్రిస్తున్నారు. ఈ కార్డులను వ్యాపార సంస్థలు, ఆర్థిక పరిపుష్టి కలిగిన ముస్లింలు ముద్రించి ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.

సమయ నిర్ధారణ పట్టిక ఎలా తయారైందంటే..

పూర్వం ముస్లింలు ఉపవాసం ప్రారంభం, విరమణ సమయాల విషయంలో ఇబ్బందులు పడేవారు. ఈ ఇబ్బందులను గమనించిన ముఫ్తీ మహమ్మద్ రహీముద్దీన్ అబ్దుల్‌వాసే ఉపవాస ప్రారంభ, విరమణ సమయ నిర్ధారణ పట్టిక తయారు చేయాలని నిర్ణయించారు. అనుకున్నదే తడవుగా కొన్ని రోజులు శ్రమించి ముస్లింలు దీక్ష చేపట్టే సమయ పట్టికను 290 పేజీల పుస్తకం 'మియారుల్ ఔకాత్'లో పొందుపరిచారు. ఇప్పటికీ ఈ పుస్తకం ఆధారంగానే ఉపవాస సమయ పట్టికను నిర్ధారిస్తున్నారు. ఈ పుస్తకం ఆధారంగా 1968వ సంవత్సరంలో తొలిసారిగా ఉపవాస సమయ పట్టికను తయారు చేశారు. ఎగువ ప్రాంతం నుంచి దిగువ ప్రాంతానికి వచ్చే సరికి సహర్, ఇఫ్తార్ వేళల్లో కొన్ని నిమిషాల తేడాతో సమయ పట్టిక రూపొందించారు. అందువల్ల ఒక పట్టణానికి, మరొక పట్టణానికి రెండు లేక మూడు నిమిషాల తేడాతో సహర్, ఇఫ్తార్‌లు ప్రారంభమవుతాయి. ఈ సమయ పట్టికకు ఉపవాస సమయ పట్టిక అని నామకరణం చేశారు. ఉపవాస సమయ పట్టిక తయారై దాదాపు 56 సంవత్సరాలకు పైగా అయింది.

వివేకానందరెడ్డి హత్య కేసులో సాక్షుల వరుస మరణాలపై ప్రత్యేక విచారణ

కడప అర్బన్ : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో ప్రధాన సాక్షి పులివెందులకు చెందిన రంగన్న బుధవారం సాయంత్రం 6.43 గంటలకు కడప రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడారు. మృతుడు రంగన్న భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తామన్నారు.. గురువారం రంగన్న మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారన్నారు. రంగన్న కేసులో ప్రధానమైన అంశం ఏమిటంటే ఈ మృతిని అనుమానాస్పద మరణంగా భావిస్తున్నామన్నారు. రంగన్నది సామాన్య మరణమా? లేక ఏవైనా కారణాలు దాగి ఉన్నాయా అనేదానిపై దర్యాప్తు జరుపుతామన్నారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ప్రధాన సాక్షులు ఒక్కొక్కరుగా మరణిస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు రంగన్నతోపాటు నలుగురు ప్రధాన సాక్షులు విడతలవారీగా మరణించారన్నారు. అందులో శ్రీనివాసరెడ్డి 2019లో, గంగాధర్‌రెడ్డి 2022లో, అభిషేక్‌రెడ్డి 2024 సెప్టెంబరులో, రంగన్న తాజాగా మార్చి 5వ తేదీన మరణించారన్నారు. వైఎస్ వివేకా హత్య కేసులో ప్రధాన సాక్షులు ఒక్కొక్కరుగా మరణించడంపై ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామన్నారు. వివేకా హత్య కేసులో నిందితులుగా ఉన్న వారి పాత్ర, ప్రభావంపై కూడా దర్యాప్తు చేస్తామన్నారు. సాంకేతికంగా కూడా ఆధారాలు సేకరిస్తామన్నారు. ప్రతి సాక్షి మరణించిన సమయంలో పోలీసులు, సీబీఐ పాత్ర ఉందని ఎవరు ప్రచారం చేస్తున్నారో, ఆ ప్రచారం వెనుక ఎవరున్నారో కనిపెడతామన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి


వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌కుమార్‌రెడ్డికి పుట్టిన రోజు కేక్‌ను తినిపిస్తున్న మండల కన్వీనర్ చంద్ర ఓబుళరెడ్డి తదితరులు

వేంపల్లె : ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.వి. సతీష్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన స్వగృహంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన భారీ కేకును కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా సతీష్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలో మనకు మంచి రోజులు రానున్నాయని, కార్యకర్తలు అధైర్యపడకుండా ధైర్యంగా ముందుకు సాగాలని కోరారు. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని మనందరం సమష్టిగా కృషి చేస్తేనే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన సాగుతోందని, ఇదంతా ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని, త్వరలోనే తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్ర ఓబుళరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు మునీర్ బాషా, సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు రామచంద్రారెడ్డి, హేమాద్రిరెడ్డి, కొత్తూరు రెడ్డయ్య, బంక సోమేశ్వర్ రెడ్డి, పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజ్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు హాలు గంగాధరరెడ్డి, కౌన్సిలర్లు ఖాదర్ బాషా, రాజశేఖరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రసూల్, సర్వోత్తమరెడ్డి, చంద్రమౌళి, సోషల్ మీడియా అధ్యక్షుడు జహీర్, జిల్లా మైనార్టీ నాయకుడు మహమ్మద్ బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు సంపత్, రాజు, ప్రశాంత్, ఆర్‌సీడీఎస్ సంస్థ అధ్యక్షుడు సురేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన మహిళ మృతి

చాపాడు : మండల పరిధిలోని అయ్యవారిపల్లెకు చెందిన పాలూరు లక్ష్మీ(35) కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 2న పాలూరు లక్ష్మీతో ఆమె ఆడ బిడ్డ దేవి గొడవ పడింది. దీంతో మనస్తాపం చెందిన లక్ష్మీ విషపు గుళికలను మింగి ఆత్మాహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటనలో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మీ పరిస్థితి విషమించి గురువారం మృతి చెందింది. ఈ ఘటనకు కారకురాలైన దేవిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతిపై కేసు నమోదు

చింతకొమ్మదిన్నె : చింతకొమ్మదిన్నె మండలం, గువ్వలచెరువు ఘాట్ నాల్గవ మలుపు వద్ద లారీ లోయలో పడి ముగ్గురు మృతి చెందిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. బెంగళూరు నుంచి ఏలూరుకు చేపల ఫీడ్ లోడుతో కడప వైపు వస్తున్న ఏపీ 35 డబ్ల్యు 2989 నెంబరుగల లారీ వేగాన్ని అదుపు చేసుకోలేక లైనింగ్ వాల్‌ను ఢీకొట్టి లోయలో పడిపోయిన విషయం విదితమే. లారీ డ్రైవర్ తన్నీరు సాంబయ్య(30), క్లీనర్ తన్నీరు నాగరాజు(24) లారీ కాబిన్‌లో ఇరుక్కుపోయి మృతి చెందారు. అదే లారీలో గువ్వలచెరువు వద్ద ఎక్కి ప్రయాణిస్తున్న చక్రాయపేట మండలం కుప్పగుట్టపల్లె నివాసి కొవ్వూరు వివేకానందరెడ్డికి తీవ్ర గాయాలు కావడంతో కడప రిమ్స్‌కు తరలించగా అదే రోజు సాయంత్రం 6.30 గంటలకు చనిపోయాడు. ఈ ప్రమాదంపై చింతకొమ్మదిన్నె పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. గురువారం మృతదేహాను వారి బంధువులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

భార్యపై భర్త మచ్చుకత్తితో దాడి


భర్త దాడిలో తీవ్రంగా గాయపడిన కళావతి

చాపాడు : అనుమానం పెనుభూతమై కట్టుకున్న భర్త భార్యను కడతేర్చేందుకు మచ్చుకత్తితో విచక్షణా రహితంగా దాడి చేసిన ఘటన మండలంలోని నక్కలదిన్నె పంచాయతీ కొట్టాల గ్రామంలో జరిగింది. కొట్టాల(బీసీ కాలనీ) గ్రామంలో గురువారం మధ్యాహ్నం ఎర్రిబోయిన భాస్కర్(48) అనే వ్యక్తి తన భార్య కళావతి(40)పై మచ్చుకత్తితో దాడి చేసి విచక్షణారహితంగా నరికాడు. ఈ ఘటనలో కళావతి తల, చేతులు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు బాధితురాలిని 108లో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ట్రైనీ డీఎస్పీ భవానీ సిబ్బందితో కలసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. గత కొన్ని నెలలుగా భర్త భాస్కర్ తన భార్య కళావతిపై అనుమానం పెంచుకుని దాడికి పాల్పడినట్లు బాధితురాలి కుటుంబీకులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ట్రైనీ డీఎస్పీ భవానీ తెలిపారు. బాధితురాలి పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆర్టీపీపీలో కాంట్రాక్టు కార్మికుడి మృతి

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని కార్మికుల ధర్నా


మృతి చెందిన ఆర్టీపీపీ కాంట్రాక్ట్ కార్మికుడు నాగరాజు


మృతదేహంతో ఆర్టీపీపీలో ధర్నా చేస్తున్న కార్మికులు

ఎర్రగుంట్ల : డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుడు శనగలగూడూరు నాగరాజు(48) విధి నిర్వహణలో మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మృతదేహంతో కార్మికులు ధర్నా చేపట్టారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం రాగితోట పాలెం గ్రామానికి చెందిన నాగరాజు 2011లో ఆర్టీపీపీలో కాంట్రాక్ట్ కార్మికుడుగా చేరారు. అప్పటి నుంచి ప్రతి రోజు స్వగ్రామం నుంచి ఆర్టీపీపీకి వచ్చి విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆర్టీపీపీలోని సీహెచ్‌పీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య నిర్మలతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రోజు మాదిరిగానే గురువారం కూడా డ్యూటీకి వచ్చాడు. మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత డ్యూటీలో ఉండగానే ఫిట్స్ రావడంతో అక్కడే ఉన్న తోటి కార్మికులు ప్రాజెక్టు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడి వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆర్టీపీపీ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా కార్మికుడు మృతి చెందాడంటూ మృతుడి కుటుంబ సభ్యులతో కలసి మృతదేహంతో ధర్నా చేపట్టారు. దీంతో ఆర్టీపీపీ యాజమాన్యం కార్మిక సంఘాల నాయకులతో చర్చించింది. మృతుడి కుటుంబానికి రూ.4 లక్షల నష్టపరిహారంతో పాటు మృతుడి కుటుంబానికి ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. దీంతో ధర్నా విరమించారు.

బద్వేలు సమీపంలో పట్టపగలే చోరీ


బీరువా పగులకొట్టి చెల్లాచెదురుగా పడేసిన దుస్తులు


బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

17 తులాలు బంగారు, రూ.4 లక్షలు నగదు అపహరణ

బద్వేలు అర్బన్ : బద్వేలుకు సమీపంలోని మడకలవారిపల్లె గ్రామంలో దొంగలు రెచ్చిపోయారు. పట్టపగలే ఓ ఇంట్లో చొరబడి 17 తులాలు బంగారు నగలు, రూ.4 లక్షలు నగదు దోచుకెళ్లారు. గురువారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాల్లోకి వెళితే.. మున్సిపాలిటీ పరిధిలోని మడకలవారిపల్లె గ్రామంలో జాతీయ రహదారి పక్కనే చీర్ల శ్రీనివాసులు, శివకుమారి దంపతులు నివసిస్తున్నారు. వీరి కుమారుడైన సుబ్రమణ్యంకు ఆరు నెలల కిందట వివాహమైంది.

అయితే గురువారం ఉదయం శ్రీనివాసులు పొలం వద్దకు వెళ్లగా.. కోడలికి జ్వరం వస్తుండటంతో తల్లికొడుకులు ఆమెను బద్వేలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ సమయంలో ఇంటికి తాళం వేసినట్లు గుర్తించిన దుండగులు తాళం పగులకొట్టి ఇంట్లోకి ప్రవేశించి రెండు బీరువాలను పగులకొట్టి అందులోని 17 తులాల బంగారు నగలు, రూ.4 లక్షలు నగదును దోచుకెళ్లారు. పొలం వద్ద పనులు ముగించుకుని ఇంటికి వచ్చిన శ్రీనివాసులు ఇంటి ప్రధాన ద్వారానికి వేసిన తాళం పగులకొట్టి ఉండటంతో అనుమానం వచ్చి భార్యకు ఫోన్ చేయగా తాము బద్వేలుకు వచ్చామని సమాధానమిచ్చారు. దీంతో ఇంట్లో చోరీ జరిగినట్లు భావించి కుమారుడైన సుబ్రమణ్యంకు ఫోన్ చేసి విషయం తెలిపారు. సుబ్రమణ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని రూరల్ సీఐ ఎం.నాగభూషణ్, సీసీఎస్ సీఐ భాస్కర్‌రెడ్డిలతో పాటు క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్ సిబ్బంది పరిశీలించారు.

పోలీసు జాగిలాల సేవలు అభినందనీయం


వాఘా, ఝాన్సీ జాగిలాలను సన్మానిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్‌బాబు, అధికారులు, సిబ్బంది


జాగిలాలను బాణ సంచా కాల్చుతూ ఊరేగింపుగా తీసుకుని వెళుతున్న అధికారులు, సిబ్బంది

'వాఘా', 'ఝాన్సీ'లకు ఘనంగా వీడ్కోలు

కడప అర్బన్ : పోలీస్ జాగిలాలు 'వాఘా', 'ఝాన్సీ' అనే జాగిలాలు 11 సంవత్సరాల పాటు విశిష్ట సేవలను అందించి, పలు కీలక విధులను సమర్థవంతంగా నిర్వర్తించడం అభినందనీయమని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్‌బాబు పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ ఈ.జీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు గురువారం సాయంత్రం స్థానిక 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో 'వాఘా', ఝాన్సీ' జాగిలాల పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పేలుడు పదార్థాలను గుర్తించడంలో నేర్పరులుగా పేరుగాంచిన లాబ్రడార్, రీట్రీవర్ జాతికి చెందిన జాగిలాలు 'వాఘా', ఝాన్సీలను అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్‌బాబు, అదనపు ఎస్పీ (ఏఆర్) బి. రమణయ్య శాలువాలను కప్పి ఘనంగా సన్మానించారు. సుదీర్ఘకాలంపాటు పోలీసుశాఖలో విధులను నిర్వర్తించి, పదవీ విరమణ సందర్భంలో కూడా సంపూర్ణ ఆరోగ్యంతో, చురుగ్గా వుండేలా కంటికి రెప్పలా చూసుకున్న హ్యాండ్లర్‌లు డి. పీరయ్య (ఏఆర్‌పీసీ 2342), బి.వి కృష్ణయ్య (ఏఆర్‌పీసీ 3093)లను, బి.వి కృష్ణయ్య (ఏ.ఆర్ పీసీ 3093)లను అదనపు ఎస్పీ ప్రత్యేకంగా శాలువా కప్పి అభినందించారు. అదనపు ఎస్పీ (ఏఆర్) బి. రమణయ్య మాట్లాడుతూ 2013 డిసెంబర్ 1న జన్మించిన 'వాఘా', 2014 సెప్టెంబర్ 9న జన్మించిన ఝాన్సీ ఏడాదిపాటు శిక్షణ పొందిన తరువాత జిల్లా పోలీసు శాఖలో సేవలను ప్రారంభించాయన్నారు. 'వాఘా'; 'ఝాన్సీ'లను మేళతాళాలతో బాణసంచా కాల్చుతూ వాటి విడిది గృహాల వద్దకు చేరి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్. డీఎస్పీ కె. శ్రీనివాసరావు, ఆర్ఐలు శివరాముడు, వీరేష్, శ్రీశైల రెడ్డి, టైటస్, ఆర్ఎస్ఐలు, బాంబు డిస్పోజబుల్ స్క్వాడ్ టీం, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తండ్రిపై కొడుకు బండరాయితో దాడి

సిద్దవటం : కన్న తండ్రిపైనే కొడుకు బండరాయితో దాడి చేయడంతో తండ్రి ఖాదర్‌హుస్సేన్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. సిద్దవటం మండలం ఉప్పరపల్లె గ్రామానికి చెందిన ఖాదర్‌హుస్సేన్ తన సొంత గృహాన్ని అద్దెకు ఇచ్చేందుకు బోర్డును ఏర్పాటు చేశాడు. అతని కుమారుడు బాబా ఫక్రుద్దీన్ ఆ బోర్డును తొలగించి తండ్రిపై బుధవారం సాయంత్రం ఇంటి వద్ద ఉన్న బండరాయితో తలపై కొటడ్డంతో తీవ్ర గాయాలతో కుప్ప కూలిపోయాడు. స్థానికులు, బంధువులు ఖాదర్ హుసేన్‌ను ఒంటిమిట్ట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు సిఫార్సు చేశారు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ ఆస్తి కోసం కన్న తండ్రిపైనే కొడుకు దాడి చేయడం అన్యాయమన్నారు. సిద్దవటం ఇన్‌చార్జి ఎస్ఐ శివప్రసాద్ జరిగిన ఘటనపై విచారిస్తున్నట్లు తెలిపారు.

అదనపు లోడు క్రమబద్ధీకరణలో 50 శాతం రాయితీ

విద్యుత్ శాఖ కడప ఆపరేషన్ డివిజన్ ఈఈ హరిసేవ్యా నాయక్



కడప కార్పొరేషన్ : విద్యుత్ వినియోగదారులకు అదనపు లోడు క్రమబద్ధీకరణలో 50 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు విద్యుత్ శాఖ కడప ఆపరేషన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హరిసేవ్యా నాయక్ తెలిపారు. గురువారం డివిజన్ కార్యాలయంలోని ఆయన ఛాంబర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గృహ వినియోగదారులు విద్యుత్ కనెక్షన్ పొందే సమయంలో తీసుకున్న లోడ్(కాంట్రాక్టెడ్ లోడ్), ప్రస్తుతం వినియోగిస్తున్న లోడ్(రికార్డెడ్ ఎం.డీ)కు వ్యత్యాసం ఉంటే స్వచ్ఛంద అదనపు లోడు క్రమబద్ధీకరణ చేసుకోవచ్చన్నారు. ఉదాహరణకు ఒక వ్యక్తి గృహావసరాలకు విద్యుత్ కనెక్షన్ పొందేటప్పుడు అతను వాడే బల్బులు, ఫ్యాన్లు, గృహోపకరాణాల వినియోగాన్ని బట్టి 2 కిలోవాట్లకు డెవలప్‌మెంట్ చార్జీలు సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించి ఉంటారనుకుంటే, ఇప్పుడు ఏసీలు, రిఫ్రిజిరేటర్లు ఇతరత్రా విద్యుత్ గృహోపకరణాల వల్ల లోడ్ పెరిగి 3 లేదా 4 కిలోవాట్ల వరకూ విద్యుత్ ఉపయోగిస్తుంటే వారు అదనపు లోడ్ పొందాల్సి ఉంటుందన్నారు. వినియోగదారులే స్వచ్ఛందంగా తమకు కావాల్సినంత అదనపు లోడ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని, అందులో విద్యుత్ నియంత్రణ మండలి 50 శాతం రాయితీ లభిస్తుందన్నారు. మార్చి 1వ తేది నుంచి జూన్ 30వ తేదీ వరకూ మాత్రమే ఈ అవకాశం ఉందన్నారు. వివరాలకు విద్యుత్ ఉపకేంద్రంలోని అధికారులను సంప్రదించవచ్చన్నారు. ఈ సమావేశంలో డీఈఈలు రామచంద్రారెడ్డి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.